క్లుప్తంగా

నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారికి ఎమ్మెల్యే బొల్లా పూజలు

ఈపూరు: మండలంలోని బొగ్గరంలో గల శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి తిరునాళ్ల శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. మండలంలోని బోడెపూడివారిపాలెంలో గల శ్రీ మద్దిరాలమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా తిరునాళ్ల

రొంపిచర్ల: మండలంలోని వీరవట్నం గ్రామ పరిధిలోని దద్దానాల మిట్ట ఆంజనేయస్వామి తిరునాళ్లను శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే మహిళలు పొంగళ్లు పొంగించి, స్వామికి నైవేద్యాలు సమర్పించారు. స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ

నరసరావుపేట ఈస్ట్: వేసవి సందర్భంగా శ్రీ కల్పవల్లి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం గీతా మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 80మందికి గ్లూకోన్-డి, సబ్జా గింజలు, ఖర్జూర, బొప్పాయి పండ్లు పంపిణీ చేశారు. ముగ్గురు చిరు వ్యాపారులకు గొడుగులను అయ్యప్పస్వామి దేవాలయం కమిటీ చైర్మన్ కొత్తూరి గోపి అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు వెల్లంపల్లి కేశవరావు, శ్రీ వాసవీ మిత్ర మండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, రాయవరపు సురేష్, మండవ వెంకటరత్నం, నాగసరపు నరసింహారావు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట దగ్ధం

రొంపిచర్ల: మండలంలోని కొనకంచివారిపాలెంలో మొక్కజొన్న పంట దగ్ధమైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఆ గ్రామానికి చెందిన వీర్ల శ్రీనివాసరావు ఎకరం పొలంలో సాగు చేసిన పంట అగ్నికి ఆహుతైంది. అలవాల గ్రామం వైపునున్న పొలాల నుంచి వస్తున్న మంటలకు పంట దగ్ధమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల కిందటే మొక్కజొన్న కండెలు కోసి, పొలంలో కుప్పగా వేశామన్నారు. మరుసటి రోజు పొలం వద్దకు వచ్చి చూసే సరికి పంట మొత్తం అగ్నికి ఆహుతైందని వాపోయారు. ఈ ప్రమాదంలో సుమారు 30 క్వింటాళ్ల కండెలు కాలిపోయి, రూ. 60 వేల నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని ఆయన కోరారు.

నేటి నుంచి చౌడేశ్వరీ ఏకాదశ జ్యోతి మహోత్సవం

నరసరావుపేట ఈస్ట్: పాతూరులోని శ్రీ చౌడేశ్వరీ అమ్మవారి ఏకాదశ జ్యోతుల మహోత్సవాన్ని ఈ నెల 23 నుంచి 25 వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్టు శ్రీతొగట వీర క్షత్రియ అభివృద్ధి సంఘం ప్రతినిధులు శనివారం తెలిపారు. 23న ఆదివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. సాయంత్రం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఉత్సవాలలో పాల్గొని అమ్మవారి కుంకుమ బండ్లు ఊరేగింపును ప్రారంభిస్తారు. 24న సోమవారం అమ్మవారికి పొంగళ్లు, మొక్కుబడులు సమర్పించుకుంటారు. సాయంత్రం ఆనకట్ట నిర్మాణం చేపడతారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో అమ్మవారికి త్రినేత్ర అలంకరణ నిర్వహించి, హోమ గుండ ప్రజ్వలన, జ్యోతుల ఊరేగింపు ప్రారంభిస్తారు. 25న మంగళవారం ఉదయం జ్యోతులు హోమ గుండ ప్రవేశం చేసి ఆనకట్ట వద్దకు చేరుకోవడంతో ఉత్సవాలు ముగుస్తాయి.

నేడు యడ్లపాడులో వైద్యశిబిరం

యడ్లపాడు: స్థానిక పీఆర్ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు ముత్తవరపు రవీంద్రబాబు, సామినేని శ్రీనివాస్, గోనుగుంట్ల కిరణ్ తెలిపారు. యడ్లపాడు గ్రామ అభివృద్ధి కమిటీ, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో షుగర్, బీపీ వ్యాధిగ్రస్తుల కోసం ఏర్పాటు చేసే ఈ శిబిరంలో డాక్టర్ లింగమల్ల భాస్కర్, డాక్టర్ నూతలపాటి షణ్ముఖం, డాక్టర్ గుంటుపల్లి సుమ సేవలు అందిస్తారని వారు పేర్కొన్నారు. రోగుల్ని పరీక్షించి రెండు నెలలకు సరిపడా మందుల్ని పంపిణీ చేయనున్నట్లు తెలియజేశారు.

5నుంచి ఉచిత వేసవి శిక్షణ తరగతులు

యడ్లపాడు: స్థానిక లూథరన్ హైస్కూల్లో విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. యడ్లపాడు అభివృద్ధి కమిటీ విద్యా విభాగం ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని ఈ ఏడాది మేనెల 5వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు. ఈ శిబిరంలో 6 నుంచి 10వ తరగతి వరకు గణిత, ఇంగ్లిష్, తెలుగు సబ్జెక్టులపై నిష్ణాతులైన అధ్యాపకులు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. ప్రతిరోజు ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు తరగతులు ఉంటాయని తెలిపారు. శిక్షణకు హాజరయ్యే వారికి సామగ్రి కూడా ఉచితంగానే అందిస్తున్నట్లు చెప్పారు. వివరాలకు 94926 15112, 99083 99169 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రంజాన్ ఈద్ ముబారక్

- అంబరాన్ని అంటిన పండుగ సంబరాలు
- కిక్కిరిసిన ఈద్గాలు
- భక్తిశ్రద్ధలతో నమాజ్
- వెల్లివిరిసిన సామరస్యం
- ఆలింగనాలు, ఆత్మీయ పలకరింపులు

యడ్లపాడు: నూతన వస్త్రాల ధగధగలు.. అత్తరు పరిమళాలు.. ఆత్మీయ ఆలింగనాలు.. నిరుపేదలకు దానధర్మాలు.. శుభాకాంక్షల అభివాదాలు.. దూద్ సేమియా మధురాలు.. బిర్యాని ఘుమఘుమలతో ఈద్ ఉల్ ఫితర్ సంబరాలు అంబరాన్ని అంటాయి. పవిత్ర రంజాన్ మాసంలో నెలరోజుల పాటు కఠిన ఉపవాసాలు ఉంటూ అల్లాహ్ ఆరాధనలో గడిపిన యడ్లపాడు మండలంలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో రంజాన్ పర్వదినాన్ని శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయాన్నే రూమీ టోపీలు, సల్వార్ కమీజ్‌లు, జుబ్బా పైజామా ధరించి ఈద్గాలకు చేరుకున్నారు. యడ్లపాడు, బోయపాలెం, కారుచోల గ్రామాల్లోని ముస్లింలు ఈద్గాల వద్ద, మిగిలిన గ్రామాల్లోని వారు స్థానికంగా ఉన్న మసీదుల్లో ప్రత్యేక పండుగ నమాజ్‌ను పఠించారు. ప్రత్యేక ప్రార్థన అనంతరం ఇమామ్‌లు, మత గురువులు ఆధ్యాత్మిక ఉపదేశమిచ్చారు. శాంతి ప్రబోధాన్ని అందించే పవిత్ర ఖురాన్ ఆవిర్భావం రంజాన్ మాసంలోనే జరిగిందన్నారు. దానం, దాతృత్వం, దయాగుణం, త్యాగనిరతికి, పవిత్రతకు రంజాన్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ధర్మ సంస్థాపన కోసమే మహమ్మద్ ప్రవక్త(సఅసం) చిట్టచివరి ప్రవక్తగా భూమిపై అవతరించారని పేర్కొన్నారు. రంజాన్ పర్వదినం దేశమంతటా సకల శుభాలు కలుగ జేయాలని ఆకాంక్షిస్తూ ఈద్ ముబారక్ తెలిపారు. అనంతరం ముస్లింలు దానధర్మాలు చేశారు. నమాజ్ అనంతరం ముస్లింలకు స్థానిక ముస్లిమేతరులు ఈద్ ముబారక్ (పండుగ శుభాకాంక్షలు) తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లింలు తమ బంధుమిత్రులు, హిందువుల్ని పండుగ విందుకు ఆహ్వానించి మతసామరస్యాన్ని చాటుకున్నారు.

సోదర భావానికి ప్రతీక రంజాన్ : గోపిరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: సమానత్వం, సోదర భావానికి రంజాన్ ప్రతీక అని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రంజాన్ పర్వదినాన్ని శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ప్రకాష్ నగర్‌లోని ఈద్గా మైదానంలో నిర్వహించిన రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పాల్గొని ముస్లిం మతపెద్దలతో కలసి దువా నిర్వహించారు. నియోజకవర్గంలోని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఖురాన్ మార్గంలో అందరూ నడిచి సోదర భావంతో సుఖ శాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. పేష్ ఇమాం రజా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



నరసరావుపేట ఈద్గా మైదానంలో జరిగిన రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

అల్లాహ్ దీవెనలతో ప్రజలకు సకల శుభాలు : బొల్లా

వినుకొండ(నూజెండ్ల) : పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలోని తిమ్మాయపాలెం రోడ్డులో గల ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లాహ్ దీవెనలతో రాష్ట్ర, నియోజకవర్గ ప్రజలకు, ప్రపంచ మానవాళికి సకల శుభాలు కలగాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం విశిష్టత అని పేర్కొన్నారు. మైనార్టీల బంధువు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని గుర్తు చేశారు. పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీలో మైనార్టీల కోసం స్కూల్, కాలేజీ, హాస్టల్‌ను నిర్మించేందుకు సహాయసహకారాలు అందించిన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి మైనార్టీల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. షాదీఖానా నిర్మాణానికి కూడా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వేడుకలు

శావల్యాపురం: మండలంలోని కారుమంచి, వేల్పూరు, పోట్లూరు, మతుకుమల్లి, శావల్యాపురం తదితర గ్రామాల్లో రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించారు. మసీదుల్లో నిర్వహించిన సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఒకరునొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. శావల్యాపురంలోని బిలాల్ మసీద్‌లో మత పెద్ద అబ్దుల్ రహీమ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ విశిష్టత గురించి తెలియజేశారు.

నరసరావుపేట రూరల్‌లో..

రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని చినతురకపాలెం, పెదతురకపాలెం, ములకలూరు, జొన్నలగడ్డ, పమిడిపాడు, ఇక్కుర్రు గ్రామాల్లోని మసీదుల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చినతురకపాలెం నూర్ మసీద్‌లో మౌలానా మహమ్మద్ ఉస్మాన్ ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి.

రొంపిచర్లలో..

మండలంలోని ముస్లింలు రంజాన్ పండుగను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఒకరినొకరు ఈద్ ముబారక్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండలంలో పలు గ్రామాల్లో మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. విప్పర్లపల్లిలో ముస్లిం కుటుంబాలకు ఆ గ్రామ సర్పంచ్, సచివాలయాల కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు గాదె రామిరెడ్డి శుక్రవారం రాత్రి రంజాన్ తోఫా సరుకులు పంపిణీ చేశారు. మండలంలో అన్నవరం, గోగులపాడు, విప్పర్లపల్లి, మునమాక, రొంపిచర్ల, సంతగుడిపాడు, అలవాల, కర్లకుంట, విప్పర్ల, ఎడ్వర్డ్ పేట, కొత్తపల్లి తదితర గ్రామాల్లో గల ఈద్గాల వద్ద ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. ముస్లిం పెద్దలు పండుగ విశిష్టత గురించి వివరించారు. అనంతరం పేదలకు దానధర్మాలు చేశారు.



వినుకొండలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

చిలకలూరిపేటలో ఘనంగా వేడుకలు

చిలకలూరిపేట: నెల రోజుల ఉపవాస దీక్షల అనంతరం ముస్లింలు రంజాన్ పండుగను శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలు, గ్రామాల నుంచి వచ్చిన ముస్లింలు పురుషోత్తమపట్నం అడ్డ రోడ్డు సెంటర్‌లో ఉన్న ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనలు చేశారు. రంజాన్ సందేశాన్ని ముఫ్తి ఖలీల్ ఖాన్ వినిపించారు. సర్వమానవాళి సుఖసంతోషాలతో ఉండాలన్న ముఖ్య ఉద్దేశమే రంజాన్ అని పేర్కొన్నారు. పొరుగువారి ఆనందాన్ని, సౌఖ్యాన్ని ఆకాంక్షించి వారికి సహాయ పడటం , నిరుపేదలకు దానధర్మాలు చేయడంలోనే ఆనందం దాగి ఉందన్న విషయాన్ని పండుగ గుర్తు చేస్తుందని తెలిపారు. ప్రేమ, కరుణ, జాలి, సహనం త్యాగం, పరోపకారం, మానవ సమానత్వాన్ని రంజాన్ విశద పరుస్తుందని వివరించారు. అనంతరం నమాజ్ చదివించి, ప్రత్యేక ప్రార్థన చేయించారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా అంజుమన్ ఇస్లామియా కమిటీ విస్తృత ఏర్పాట్లు చేసింది.



నరసరావుపేటలో రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న కవలలు



కారుచోలలో ఈద్గా వద్ద సామూహిక నమాజుకు హాజరైన ముస్లింలు



కారుమంచిలో ప్రత్యేక ప్రార్థనలు



యడ్లపాడు హైవే పక్కన ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు



విప్పర్లపల్లిలో రంజాన్ తోఫా సరుకులను అందజేస్తున్న సర్పంచ్ గాదె రామిరెడ్డి



రొంపిచర్లలో ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలు



చిలకలూరిపేటలో ఈద్గా వద్ద నమాజు



చినతురకపాలెం మసీదు వద్ద ప్రత్యేక ప్రార్థనలు

పలుచోట్ల చలివేంద్రాల ప్రారంభం



వినుకొండలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



నరసరావుపేటలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

వినుకొండ(నూజెండ్ల) : పట్టణంలోని మార్కాపురం రోడ్డులో స్టోన్ క్రషర్స్ యజమానుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణానికి వచ్చే ప్రయాణికులు, బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం స్టోన్ క్రషర్స్ యజమానులు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పురపాలక సంఘం ఆధ్వర్యంలో..

నరసరావుపేట: వేసవిని దృష్టిలో పెట్టుకొని పురపాలక సంఘం ఆధ్వర్యంలో రూ.5లక్షలతో పట్టణంలో తొమ్మిది ప్రదేశాల్లో చలివేంద్రాల్ని ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. పురపాలక సంఘ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. పట్టణ ప్రజలు చలివేంద్రాల్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ ఓలేటి శ్రీనివాసరావు, కాకుమాను ఫౌండేషన్ చైర్మన్ కాకుమాను సదాశివరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ ఖాదర్ బాష పాల్గొన్నారు.

యడ్లపాడు రెవెన్యూ కార్యాలయం వద్ద..

యడ్లపాడు: స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఎస్. నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఎంపీపీ ఎంపీపీ పిడతల రూన్సీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి దృష్ట్యా బాటసారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వమే చలివేంద్రాలు ఏర్పాటు చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో డీటీ శ్యామలత, రెవెన్యూ మండల సర్వేయరు రాంబాబు, వీఆర్వోల అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు చారి, వీఆర్వో మధుసూదనరావు, సిబ్బంది అనిల్ పాల్గొన్నారు.

నాదెండ్ల, గణపవరం సొసైటీ చైర్మన్ల ప్రమాణ స్వీకారం



నాదెండ్ల సొసైటీ చైర్మన్ కోటిరెడ్డితో జెడ్పీటీసీ సభ్యుడు మస్తాన్‌రావు తదితరులు



గణపవరం చైర్మన్ ఏడుకొండల్ని సన్మానిస్తున్న సీఈవో లక్ష్మయ్య తదితరులు

నాదెండ్ల: నాదెండ్ల-గణపవరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతన కమిటీ చైర్మన్లు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. నాదెండ్ల సొసైటీ చైర్మన్‌గా గొరిజవోలుకు చెందిన కురుగంట్ల వెంకటరెడ్డి, సభ్యులుగా సంక్రాంతిపాడు గ్రామానికి చెందిన జెట్టి బొల్లయ్య, గొరిజవోలుకు చెందిన ఈవూరి అంజిరెడ్డితో సీఈవో టి.సీహెచ్. అంజయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. గణపవరం కమిటీ చైర్మన్‌గా ఇర్లపాడు గ్రామానికి చెందిన మంగు ఏడుకొండలు, సభ్యులుగా అమీన్‌సాహెబ్‌పాలేనికి చెందిన గుర్రం రామారావు, కనపర్తికి చెందిన ఓర్సు ఇన్నయ్యతో సీఈవో పెడవల్లి లక్ష్మయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఇప్పటి వరకు చైర్మన్‌లుగా పని చేసిన సింగారెడ్డి కోటిరెడ్డి, కాట్రు రమేష్ కొత్త సభ్యుల్ని సత్కరించి రికార్డుల్ని అప్పగించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ సభ్యుడు కె. మస్తాన్‌రావు, ఎంపీపీ తలతోటి రాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త కమిటీ సభ్యులు రైతులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కె. సుందరరావు, కౌన్సిలర్ టి. సుధాకర్, సర్పంచులు జి. కాశియ్య, గృహలక్ష్మి, అల్లడి రవికుమార్, బత్తుల సీతారామిరెడ్డి, జెట్టి నాగమణి పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఆదర్శవంతమైన పాలన



మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్రంలో సీఎం వై.ఎస్. జగనన్న ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మండలంలోని మురికిపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మంత్రి విడదల రజినీకి స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరు గురించి ఆమె తెలియజేశారు. ఏ ఇంటికి ఏ పథకం ద్వారా లబ్ధి చేకూరిందో వివరించారు. స్థానికుల సమస్యలు వింటూ వాటికి పరిష్కారాల్ని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని తెలిపారు. కష్టాలు తెలిసిన నేత రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం ప్రజలు చేసుకున్న అదృష్టమని పేర్కొన్నారు. వార్డు, గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అవినీతికి ఆస్కారం లేని విధంగా పథకాల్ని అమలు చేస్తున్నారని తెలిపారు. వాటిని మరింత సమర్థంగా అమలు చేసి ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించడమే లక్ష్యంగా గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం ఎంతో భరోసా కల్పిస్తోందని వెల్లడించారు. మరోవైపు నాడు-నేడు వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రుల్ని కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తోందని తెలిపారు. ప్రజలంతా ప్రభుత్వానికి అండగా ఉన్నారని చెప్పేందుకు కార్యక్రమానికి లభిస్తున్న స్పందనే నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, గ్రామ సర్పంచ్ ఉసర్తి భూలక్ష్మి, ఉప సర్పంచ్ కొమ్మనబోయిన రామకృష్ణరాజు, వైస్ ఎంపీపీ సూరబోయిన ఆదిలక్ష్మి, మురికిపూడి పీఏసీఎస్ అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటశివ, ఎంపీటీసీ సభ్యులు జమ్ములమడక సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉసర్తి రాంబాబు, కొమ్మనబోయిన చెంచురాములు, బోడి సాంబయ్య, గోగు ముక్కంటి, దాసరి హనుమంతరావు, జాష్టి సూరయ్య పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాల ప్రచారం

యడ్లపాడు: మండలంలోని సొలసలో శనివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. గ్రామ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి కుటుంబ సభ్యులకు వివరించారు. అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తూ, పారదర్శక పాలనతో నేరుగా అర్హులైన వారి ఖాతాలకే పథకాలను అందజేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి మరోమారు అధికార పగ్గాలు అందించాలని కోరారు. కుటుంబ సభ్యుల అనుమతితో వారి ఇంటి గోడలపై, సెల్‌ఫోన్లకు జగనన్న చిత్రాల స్టిక్కర్లను అతికించారు. టోల్‌ఫ్రీ నంబర్‌కు మిస్డ్ కాల్స్ చేయించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మద్దూరి విజయబాల, చంద్రారెడ్డి, పాలూరి శ్రీనివాసరెడ్డి, మద్దూరి శ్రీనివాసరెడ్డి, గృహ సారథులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ధరిత్రి దినోత్సవం

వినుకొండ(నూజెండ్ల): లోకల్ టూ గ్లోబల్ అంతర్జాతీయ కార్యక్రమం ద్వారా జర్మనీకి చెందిన టీడీహెచ్ అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థతో ఆర్.ఎల్.హెచ్.పి.మైసూర్ తోడ్పాటుతో స్థానిక హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సమీపంలోని అరుంధతి కాలనీలో మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడి విభిన్న కార్యక్రమాల ద్వారా ధరిత్రి దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. టీడీహెచ్ ప్రతినిధి గోడె ప్రసాద్ మాట్లాడుతూ నేలను, పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. సంస్థ డైరెక్టర్ ఆనంద్ బెంజిమెన్, సిబ్బంది విద్యారావ్, సంధ్య, రమేష్ పాల్గొన్నారు.